

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**ఎక్ చతుర నార్ కర్‌కే సింగార్**

**మెరె మన్‌కె ద్వార్ యె ఘుసత్ జాత**

**హం మరత్ జాత, అరె హెహెహె...**

హిందీ సినిమాలలో హాస్యగీతాలు అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది 'పడోసన్' సినిమాలో కిషోర్ కుమార్, మన్నాడేలు మధ్య మధ్య మహమూద్ సంభాషణలతో తెరపై చేసిన ఈ హంగామా పాట. తెరపై ఆరున్నర నిముషాలుండే ఈ పాట ఒక జీవితకాలం పాటు హాస్యాన్ని చిందించే పాట. పాడుకుని నవ్వుకోగలం. తెరపై చూస్తూ నవ్వుకోగలం. అర్థం తెలుసుకుంటూ నవ్వుకోగలం. నటీనటుల నటన చూస్తూ, తరువాత గుర్తు తెచ్చుకుని మరీ నవ్వుకోగలం. అత్యుత్తమ కళాకారులు, అత్యంత ఆరోగ్యకరమైన హాస్యాన్ని, అత్యుత్తమ కళా ప్రదర్శన ద్వారా అందించాలని నిశ్చయించుకుంటే దాని ఫలితం 'ఎక్ చతురనార్' పాటలాగా ఉంటుంది. గమనిస్తే, పాట పాడటంలో కానీ చిత్రీకరణలో కానీ, నటనలో కానీ ఎక్కడా తాము అత్యద్భుతమైన హాస్యం సృష్టిస్తున్నామన్న స్పృహ కనబడదు. అంతగా తమ సృజనలో లీనమైపోయారు వారు.

'పడోసన్'లో ఈ పాట సన్నివేశం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. నాయికకు పాటలంటే ఇష్టం. దాంతో పాటలు రాని నాయకుడు, ఓ గాయక మిత్రుడి సహాయం తీసుకుంటాడు. ఆ అమ్మాయికి ఓ సంగీతం మాష్టారుంటాడు. అతడితో వీరికి పోటీ. ఆ సంగీతం మాష్టారు హాస్యనటుడు మహమూద్ అయి, ఆ గాయక మిత్రుడు కిషోర్ కుమార్ అయితే ఇక హాస్యానికి కొదువ లేదు. హిందీ సినీరంగంలో తొలి హాస్య హీరో కిషోర్ కుమార్. హాస్యనటుడి వేషాలు వేసి హీరోలుగా ఎదిగి స్థిరపడినవారు అరుదు. కానీ హాస్యం ఆధారంగానే కెరీరు నిర్మించుకుని హీరోగా, గాయకుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, స్థిరపడిన వాడు కిషోర్ కుమార్ ఒక్కడే. కిషోర్ కుమార్ ప్రతి చర్యలో విషాదంతో కూడిన హాస్యం ఉంటుంది. హాస్య నటుడిగా ఎంత డబ్బు సంపాదించాడంటే, పన్ను కట్టటం తప్పించుకునేందుకు తప్పనిసరిగా ఫెయిల్ అయ్యేందుకు నిర్మించిన సినిమా 'చల్తీకా నాం గాడీ' సూపర్ డూపర్ హిట్ అయి, క్లాసిక్ కామెడీ సినిమాగా ఎదిగింది.

'ఇన్‌కంటాక్స్' కట్టేందుకు డబ్బుల్లేక ఇతరులకు పాడటం ప్రారంభిస్తే హిందీ సినీరంగంలో నెంబర్ వన్ గాయకుడయ్యాడు, మహమ్మద్ రఫీని పదవీచ్యుతుడిని చేసి.

కిషోర్ కుమార్ హాస్యం సున్నితంగా ఉంటుంది. మోటుగా ఉంటుంది. అవసరమైతే చిన్న పిల్లవాడి వేషం వేసుకుని, ముద్దుముద్దుగా మాట్లాడుతూ 'చీల్ చీల్ చిల్లాకే కజ్రీ సునాయ్' (హాఫ్ టికెట్) అంటూ హంగామా చేయగలడు. అవకాశం దొరికితే యోడలింగ్ చేస్తూ, గిబ్బరిష్ గానం చేస్తూ 'బాకాలోబాక్' అంటూ 'మైహూన్ ఝూం ఝూం ఝూమ్రూ' (ఝూమ్రూ) అంటూ అలరించగలడు. 'ఇనమినడిక' అని నృత్యం చేస్తూ ఊపేయగలడు. అవసరమైతే 'కోయీ హం దం న రహా' అంటూ గాంభీర్యాన్ని పలికించగలడు. 'వర్సటైల్ ఏక్టర్' అనడానికి నిదర్శనం కిషోర్ కుమార్. తన ఈ అల్లరి చిల్లరి సిల్లీ వేషాల వెనుక అత్యంత తీవ్రమైన సృజనాత్మకతను, లోతైన గాంభీర్యాన్ని కప్పిపుచ్చగలడు. అయితే, హాస్యనటుడిగా కిషోర్ కుమార్ విఫలమయింది హిందీ 'మిస్సమ్మ'లో. తెలుగులో పాట నేర్చుకునే సన్నివేశంలో నాగేశ్వరరావు ఎంతగా నవ్విస్తాడో, హిందీలో కిషోర్‌కుమార్ అంతగా ఏడ్పిస్తాడు. ఎందుకంటే, కిషోర్‌కుమార్ గాయకుడు. ఆయన ఎలా పాడినా బాగానే ఉంటుంది. అందుకే 'గానా న ఆయా, బజానా న ఆయా' అని పాడినా అద్భుతంగా ఉండి, పాటరాని వాడు పాడినట్టుండదు. ఇలాంటి దృశ్యం 'పడోసన్'లోనూ ఉంటుంది. అది బాగా పండుతుంది. ఎందుకంటే, పాటను నేర్చుకోవాలని ప్రయత్నిస్తున్నది పాటరాని సునీల్‌దత్ కాబట్టి.

మహమూద్ హాస్యనటనకు ప్రసిద్ధి. కానీ మహమూద్ హాస్యంలో సున్నితత్వం అన్నది ఉండనే ఉండదు. వెకిలి హాస్యం, వెక్కిరింతల గోల, ద్వందార్థాలే అతడి హాస్యం. కానీ ఎదురుగ కిషోర్‌కుమార్‌లాంటి వాడుంటే, మహమూద్ కూడా కిషోర్‌కుమార్ స్థాయితో సరితూగగల హాస్యం పండించాల్సి ఉంటుంది. మహమూద్‌లోని మంచి కళాకారుడు జాగృతమవ్వాల్సి ఉంటుంది. స్వతహాగా మహమూద్ మంచి నటుడు. కానీ హిట్ సినిమాల ప్రలోభంలో పడి వెకిలి హాస్యానికి అలవాటు పడ్డాడు. ఆయన స్వయంగా నిర్మించిన సినిమాలలో అతని హృదయం తెలుస్తుంది.

'పడోసన్' సినిమాకు పాటలు రాసింది రాజిందర్ క్రిషన్. హిందీ సినీ గేయరచయితలలో పరమాద్భుతమైన గేయాలు రచించి కూడా, సరైన గుర్తింపు పొందని గేయ రచయత, స్క్రిప్టు రచయత రాజిందర్ క్రిషన్. ఆయన 'హం సె ఆయా న గయా' అన్న గీతాన్ని ఎంత గొప్పగా రచించాడో. 'జరూరత్ హై ఎక్ శ్రీమతీకీ ' అన్న పాటను అంతే సులువుగా రచించాడు. 'యె జిందగీ ఉసీ కి హై' అన్న హృదయాన్ని స్పందింపచేసే రొమాంటిక్ గీతం ఎంత అద్భుతంగా రచించాడో, 'ధీరేసే రి అఖియాన్ మే' అన్న జోలపాటను అంత మధురంగా రచించాడు. 'ఉన్‌కో యెషికాయత్ హై' అన్న పాటను ఎంత

లోతైన భావంతో రచించాడో, 'మురేఖ లే చలో' పాటను అంతకన్నా లోతైన భావనలతో సృజించాడు. కాబట్టి 'ఏక్ చతుర నార్ ' పాటలో హాస్యం పండించటం, పదాల విరుపులతో మెరుపులు వెదజల్లటం అతడికి వెన్నతో పెట్టిన విద్య.

ఇక 'మన్నాడే' గాన చాతుర్యం గురించి ఎంత చెప్పినా తక్కువే. అద్భుతమైన గాయకుడయి కూడా అగ్రస్థాయి గాయకుడిగా గుర్తింపు పొందలేకపోవటం అతడి దురదృష్టం. అతని స్వరం ఏ అగ్రశ్రేణి హీరో స్వరంగా స్థిరపడకపోవటం ఓ విషాదం. అవకాశాలు వచ్చాయి. కానీ అదృష్టం కలసి రాలేదు. రాజ్‌కపూర్ స్వరంగా స్థిరపడే సమయానికి ముకేష్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభమయింది. దాంతో మన్నాడే కేరక్టర్ పాత్రలకు పరిమితమవ్వాల్సి వచ్చింది. దేవ్ ఆనంద్ స్వరంగా నిలవాలనుకుంటే మహమ్మద్ రఫీ ముందు, కిషోర్ కుమార్ తరువాత 'మేమున్నాం' అన్నారు. ఈ రకంగా 'మన్నాడే' అత్యంత ప్రతిభ ఉండి కూడా ద్వితీయ శ్రేణి గాయకుడిగా మిగిలిపోవాల్సి వచ్చింది. అయితే పాటలో భావమేదైనా దాన్ని సంపూర్ణంగా పండిస్తాడు మన్నాడే. 'పూఛో న కైసే' లోని దుర్భర విషాదం 'లపక్ ఝపక్ ' లోని సంపూర్ణ హాస్యం మన్నాడే ప్రతిభకు మచ్చు తునకలు. అతడు 'ఏక్ చతుర్ నార్' పాటకు ప్రాణం పోయటం స్వాభావికంగా జరిగింది.

'ఏక్ చతుర్ నార్' పాట సంగీత దర్శకుడు ఆర్.డీ.బర్మన్. అప్పటికి ఆర్.డీ బర్మన్ ఇంకా పూర్తిగా తండ్రి ఎస్.డీ.బర్మన్ నీడనుంచి బయటకు రాలేదు. అతనికి మహమూద్‌కు మంచి దోస్తీ. మహమూద్ నిర్మించిన తొలి సినిమా 'ఛోటా నవాబ్' సంగీత దర్శకుడిగా ఆర్డీబర్మన్ తొలి సినిమా. మహమూద్ నిర్మించిన రెండవ సినిమా 'భూత్ బంగ్లా'కు కూడా సంగీత దర్శకుడు ఆర్డీ బర్మనే. కాబట్టి 'పడోసన్'కు ఆర్డీ బర్మన్ సంగీత దర్శకుడవటం స్వాభావికం. అయితే ఆర్డీ బర్మన్ అంతకు ముందు ఎస్డీ బర్మన్‌కు సహాయకుడిగా పనిచేయటం, 'చల్తీ కా నాం గాడీ'లో సందర్భోచితమైన హాస్య సంగీతాన్ని నేపథ్యంలో అందించటంతో 'పడోసన్'లాంటి సినిమాలో హాస్య గీతాల్ని సృజించటం పట్ల ఎవరికీ ఎలాంటి సందేహం లేదు. 'చల్తీ కా నాం గాడీ'లో ఓ అమ్మాయి వెంట పరుగెత్తి వస్తూంటే అనూప్‌కుమార్ తప్పించుకుని పరుగెత్తే సన్నివేశంలో వినిపించిన నేపథ్య సంగీతాన్ని 'ఏక్ చతుర్ నార్' పాటలో మధ్యలో వాడుకోవటం గమనించవచ్చు. మహమూద్ పాత్రతో పోరుకు సునీల్‌దత్ పాత్ర షర్ట్ మడచి సిద్ధమవుతూంటే, అతని స్నేహితులు తాడు విసిరి అతడిని వెనక్కులాగే సందర్భంలో ఈ సంగీతం వినిపిస్తుంది. అయితే, అప్పటికి ఇంకా పెద్ద సంగీత దర్శకుడిగా పేరు రాలేదు కాబట్టి, కిషోర్ కుమార్, మహమూద్‌లు అతని ప్రాణ స్నేహితులు కాబట్టి, అహంకారాలు లేకుండా అందరూ కలిసి కూర్చుని చర్చించి సమిష్టిగా 'ఏక్ చతుర్ నార్ ' అనే అద్భుతమైన పాటను సృజించారు.

'ఎక్ చతుర్ నార్' పాట శాస్త్రీయ సంగీత పోటీ పాట. కానీ హాస్యం పండాలి. ఈ సినిమాలో మహమూద్ పాత్ర తమిళుడు. తమిళ యాసతో మాట్లాడ్తాడు. అదో హాస్యం కాబట్టి పాట కూడా తమిళ యాసతో పాడాలి. ఈ సినిమాలో 'వాంగో' అని ఓ పాట ఉంటుంది. మన్నాడే ఆ పాటను తమిళ యాసతో చక్కగా పాడి పండించాడు. ఈ పాటలో కూడా మధ్య మధ్యలో మహమూద్ తమిళ యాసతో మాట్లాడుతూంటే, మన్నాడే అదే యాసతో పాట అందుకుంటాడు. 'యక్ చతుర్ నార్' అంటూ అచ్చు తమిళ హిందీని చిలికిస్తాడు. ఇది హాస్యాన్ని కలిగిస్తుంది. కానీ ఇది వెకిలి హాస్యం.

ఈ పాటను ఆర్డీ బర్మన్ ఖమోజ్, బిహాగ్, దేశ, ఛాయానట్ రాగాల రాగమాలికగా రూపొందించాడు. పాట ఒక రాగం నుంచి మరో రాగానికి అవలీలగా దూకుతుంటుంది. నది వంపులు తిరిగి హఠాత్తుగా జలపాత ధారలా దూకినట్టు. అందుకే పాట మధ్యలో కిషోర్ కుమార్ రాగం మార్చి 'ఓ గా రే గా రే ' అంటూంటే మహమూద్ 'యే గడ్‌బడ్ జీ ', 'యే సుర్ బద్లా', 'యే హం కో భట్ కాయా' అంటూ 'రాగం మార్చి దారి తప్పించాడ'ని హాస్యంగానే పాట వినేవారికీ, చూసే వారికీ రాగాల మిశ్రమాన్ని సూచిస్తాడు. 'యే సుర్ కిధర్ హై జీ? యే సుర్ యే! ఎన్నయా ఇద' అంటూ 'ఖమాజ్'ని పట్టుకుని 'యక్ చతుర్ నార్' అంటూ అసలు రాగంలోకి వస్తాడు.

'పడోసన్' సినిమాలో ఈ 'పోటీ' పాట రూపొందటం వెనుక బోలెడంత చరిత్ర ఉంది. సమిష్టి సృజనాత్మకతల మేళవింపు ఉంది. ఈ పాట బాణీ ఆలోచన కిషోర్ కుమార్ ఆలోచన అని ఆర్డీ బర్మన్ స్వయంగా వెల్లడించాడు. కిషోర్ కుమార్ పై తొలి తరం మహిళా సంగీత దర్శకురాలు 'సరస్వతీదేవి' ప్రభావం అమితంగా ఉంది. ఆయన 'ఝూమ్రూ' సినిమాలో స్వీయ సంగీత దర్శకత్వంలో పాడిన 'కోయి హం దం న రహా', సరస్వతీదేవి 1936లో 'జీవన్ నయ్యా' కోసం రూపొందించిన 'కోయి హం దం న రహా' పాటకు నకలు. చరణాలు మజ్రూహ్ వేరేగా రాశాడు. ఇతర అనేక కిషోర్ సృజనలలో సరస్వతీదేవి ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇక్కడ గమనించాల్సిందేమిటంటే, 'కోయి హం దం న రహా' పాట రూపొందినప్పుడు కిషోర్‌కు అయిదేళ్ళు. ఆయన అన్న అశోక్ కుమార్ వెంట పాట రిహార్సల్స్ కు వెళ్ళేవాడు. అశోక్‌కుమార్ గాయకుడు కాదు. ఈ పాట కిషోర్ మనస్సులో ఎంతగా ముద్రించుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. అలాగే కిషోర్ కుమార్‌కు పదేళ్ళ వయస్సున్నప్పుడు 1941లో 'ఝూలా' సినిమాలో అశోక్ కుమార్, సరస్వతీదేవి సంగీత దర్శకత్వంలో 'ఎక్ చతుర్ నార్' అంటూ నాయిక గురించి నాలుగు లైన్లు పాడతాడు. ఆ సమయంలో అశోక్‌కుమార్ పాడిన ప్రతి పాటా వినీ కిషోర్ కుమార్ 'ఈ పాట నీకంటే బాగా నేను పాడతాను' అని ఛాలెంజ్ చేసేవాడు. పైగా కిషోర్ కుమార్‌కు ఎదుటివారు పాడిన పాటను వెక్కిరింతగా పాడే అలవాటుంది. 'తెరి ఛత్రిమే లాగా చోర్ ముసాఫిర్ ', 'ధీరే సె జానా బగియన్ మే' వంటి గొప్ప పాటలకు వెక్కిరింతగా పాడి మెప్పించాడు కిషోర్. ఇతరులను అనుకరిస్తూ పాడి హాస్యం సృజించటం ఆయనకు అలవాటు. అందుకని, 'పడోసన్' హాస్య సన్నివేశంలో ఆయనకు సరస్వతీదేవి సృజన 'ఎక్ చతుర

నార్' గుర్తుకు రావటం, అన్న పాడిన పాటను అపహాస్యం చేస్తూ హాస్యం సృజించాలనుకోవటంలో ఆశ్చర్యం లేదు. అలా ఆరంభమయింది 'ఎక్ చతుర్ నార్ ' హాస్యగీత సృజన.

'ఎక్ చతుర నార్' పాట రూపొందించటానికి దాదాపుగా పదిరోజుల పైనే పట్టిందని మన్నాడే ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. ఈ పాట రూపొందటంలో ఈ పాటకు సంబంధించిన వారే కాదు. పాట చిత్రీకరణలో పాల్గొన్న ప్రతివారి హస్తం ఉందంటాడు మన్నాడే. బోలెడన్ని రిహార్సల్స్ తరువాత ఫైనల్ రిహార్సల్ తొమ్మిదిగంటలు పట్టిందట. అప్పుడు కానీ రికార్డింగ్‌కు సిద్ధం కాలేదట. అయితే, ఈ పాటలో పదాలు ఎన్నుకోవటం, చిత్రీకరణ, వాయిద్యాల ఎంపిక దగ్గర నుంచి రికార్డింగ్ వరకూ ప్రతి విషయంలో కిషోర్ కుమార్ హస్తం ఉందట. ఈ సందర్భంగా, ఈ సినిమాకు సంబంధించిన మరో సంఘటనను గుర్తుచేసుకోవాల్సి ఉంటుంది. 'పడోసన్' లో ఓ సందర్భంలో సునీల్‌దత్‌కు హీరోయిన్‌ను ఎలా ఆకర్షించటం, ఆమె ఎదురు పడితే ఏమనాలో కిషోర్ కుమార్ నేర్పిస్తాడు. స్క్రిప్టు ప్రకారం ఈ సందర్భంలో సంభాషణలు చమత్కార భరితంగా ఉంటాయి. చిత్రీకరణ దగ్గరకు వచ్చేసరికి కిషోర్ కుమార్ దృశ్యాన్ని పూర్తిగా మార్చేశాడు. సంభాషణలను పాటగా మార్చేశాడు. మాటలకు బాణీ కట్టాడు. మాటల రచయిత, గేయ రచయిత రాజేందర్ క్రిషన్ కావటంతో అనవసరమైన చోట మాటలను బాణీలో కూర్చాడు రాజేందర్ క్రిషన్. అంతేకాదు, పాట చిత్రీకరణ, కొరియోగ్రఫీ సర్వం కిషోర్ కుమార్ నిర్వహించాడు. 'పడోసన్'లో మరో మరుపుకురాని దృశ్యం అది.

మెరె భోలే బలం, మెరె ప్యారే బలం

మెర జీవన్ తెరేబినా, హా మేరే పియా, వో వోదియా.

కె జిస్మే తేల్ న హో, కె జిస్మే తెల్ నా హో

మెర జీవన్ తెరిబినా

వో ఏక్ బాగ్ హై

బహార్ జిస్ సే హట్ కర్ గుజ్రే

దూర్ దూర్ సె గుజ్రే

ముఝొ అప్నా బనాలో

ఓ ముఝొ అప్నా బనాలో

హేయ్ రె భోలే అప్నా బనాలో

తేరె కద్మోం మే మెరా ప్యార్, మేర సంసార్

మెరీ కిస్మత్ హై ముఝే అప్నా బనాలో

గమనిస్తే, ఇవన్నీ నాటకంలో సంభాషణలుగా బాగా పేలతాయి. హాస్య నటులు ఇలాంటి సంభాషణలు పలుకుతూ నవ్వులు కురిపించిన సందర్భాలున్నాయి. కానీ కిషోర్ కుమార్ సృజనలో ఇది మరపురాని గేయ దృశ్యంగా రూపొందింది. 'ప్యార్ కియే జా' సినిమాలో సినిమా కథ చెప్తూ మహమూద్ నవ్వించిన దృశ్యం అద్భుతం. కానీ దాన్ని వివరించటం కష్టం. కానీ ఈ దృశ్యంలో పాట ఉండటం, పాటలకు తగ్గ నృత్యం ఉండటంతో ఈ దృశ్యాన్ని తలచుకుని పదే పదే ఆనందించే వీలు చిక్కింది. ఇది సినిమాల్లో పాటల ప్రాధాన్యం. అంటే, 'పడోసన్' సినిమా దర్శకుడెవరన్న దానితో సంబంధం లేకుండా అధికశాతం కిషోర్ కుమార్ సృజన ఫలితం అన్నమాట. అందుకే, కథాపరంగా పెద్ద ప్రాధాన్యం లేకున్నా కిషోర్ కుమార్ పాత్ర అందరినీ డామినేట్ చేస్తుంది, చివరికి మహమూద్‌ని కూడా! ఎందుకంటే మహమూద్ పాత్రలో అవహేళన ఉంటుంది. కిషోర్ కుమార్ పాత్రలో చమత్కారంతో కూడుకున్న అమాయకత్వపు నిజాయితీ ఉంటుంది. ముఖ్యంగా చివరి దృశ్యంలో వెనుక నుంచి పాట పాడేది కిషోర్ కుమార్ అని వెల్లడి అయిన దృశ్యంలో కిషోర్ కుమార్ హావభావాలు, నటన మరపురానివి.

'ఎక్ చతుర నార్' పాటను కర్ణాటక, హిందుస్తానీ సంగీతాల కలయికగా రూపొందించారు. మహమూద్ పాత్ర కర్ణాటక సంగీత విద్వాంసుడు. అందుకని పాట కర్ణాటక సంగీతంతో ఆరంభమవుతుంది. అయితే పాటపాడే సమయంలో, అంటే రికార్డింగ్‌లో కూడా కిషోర్ కుమార్ పాటను మార్పుచేసి పాడటంతో రికార్డింగ్‌లో ఉన్న వారూ విస్మయానికి గురయ్యారు. అది ఈ పాటలో స్పష్టంగా కనిపిస్తుంది. ఉదాహరణకు రిహార్సల్స్ చేసినట్టు కాకుండా కిషోర్ కుమార్, రికార్డింగ్‌లో 'హం ధాం' అనేది జోడించి పాటలోకి వచ్చాడట. అలాగే, 'ఓ తేడే, సీ ధే హోజా రే' అన్నది జోడించి 'నాచ్ న జానే' అంటూ పాట అసలు పాటలోకి వచ్చాడట. అలాగే పాట మధ్యలో రాగం మార్చి 'దేఖీ తెరీ చతురాయీ' అనేందుకు 1939లోని సంత్ తులసీ దాస్ సినిమాలోని 'చందారే జారే జారే' పాట బాణీని కిషోర్ కుమార్ వాడి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. కానీ రికార్డింగ్ కాబట్టి ఎవ్వరూ నోరు మెదపలేదు. కానీ పాట అద్భుతంగా రూపొందటంతో కిషోర్‌ను అభినందించక తప్పలేదు.

‘ఒక చతుర్ నారి సింగారించుకుని అతడి మనస్సు ద్వారంలోంచి దూసుకు వచ్చిందట. అతడు ఆమె అందానికి పడి చచ్చిపోయే స్థితికి చేరుకున్నాడట. పాట ఆరంభం ఇది. దీన్లో ఇది 'హాస్య పాట' అనటానికి ఘుసత్ జాత్, మరత్ జాత్

వంటి పదాలు సూచనలు. మామూలు హీరోల పాటలయితే ఇలాంటి పదాలు వాడరు. హాస్యగీతాల రచనకు ప్రత్యేకమైన పదజాలాన్ని వాడతారు. కాస్త హేళన, కాస్త చులకన భావాన్నిచ్చే పదాలుంటాయి హాస్య గీతాలలో.

ఇక పాటను ఆరంభించి 'ప రే సా' అంటూ మన్నాడే ఒక స్థాయిలో పాటను డామినేట్ చేస్తూంటే, ఆ లయను భగ్నం చేస్తూ , రాగాన్ని భగ్నం చేస్తూ కిషోర్ కుమార్ ప్రవేశం చేస్తాడు. ఆరంభిస్తాడు. మన్నాడే పాడుతున్నప్పుడు తాను సిద్ధం అవుతున్నట్టు, వేలితో వెంట్రుకలను తోసుకుని, అలెర్ట్ అవుతాడు. పరతి చిన్న విషయాన్ని కూడా ఎంతో జాగ్రత్తగా తీశారీపాటలో.

**'ఉం థాం'**

**'అయ్యో!'**

**అరె థాం, ఓ థాం, ఓ థాం థాం థాం , రుక్.**

ఇక్కడ 'థాం' అన్నది అర్థంలేని పదం కాదు. ఓ స్థాయిలో రాగాలాపన మైమరచి చేస్తున్న ప్రత్యర్థి రిథం దెబ్బ తీసేందుకు 'ఆగు' అని అరచినట్టు 'థాం' అంటూ బాంబు పేల్చినట్టు అని 'ఆగరా' అన్నట్టు అంటాడు కిషోర్. థాం అంటే ఆగు అని అర్థం. ఇక కిషోర్ డామినేషన్ ఆరంభమవుతుంది. ఇది ఓ పోటీ ఆట పాట అనిపిస్తుంది. ఓ ఆటలో ప్రథమంగా సర్వ్ చేసేవాడిది ఆధిక్యం ఉంటుంది. దాన్ని ఎలా రిసీవ్ చేసుకుని తిప్పి కొడతాడో అన్న దానిపై రెండోవాడి ఆధిక్యం ఆధారపడి ఉంటుంది. ఆటల్లో ప్రత్యర్థి రిథమ్ను దెబ్బ తీయటం మొదటి లక్ష్యం. ఆ తరువాత తన ఆధిక్యాన్ని నెరపటం, ఆధిక్యాన్ని నిలుపుకోవటానికి ప్రాధాన్యం. అయితే, ప్రత్యర్థి అంత సులువుగా ఆధిక్యాన్నిచ్చేస్తే ఆటలో మజా రాదు. ప్రత్యర్థి లాక్కున్న ఆధిక్యాన్ని తిరిగి లాక్కుని తన ఆధిక్యాన్ని నిలుపుకోవటం కోసం ప్రయత్నించటంతో ఆట రసకందాయాన్ని చేరుకుంటూంది. ఇలా పోటాపోటీగా నువ్వా నేనా అన్నట్టు సాగితేనే ఆటల్లో మజా ఉంటుంది. ఆట 'హిట్' అవుతుంది. అది ఈ పాట సంపూర్ణంగా సాధించింది. మన్నాడే, కిషోర్ కుమార్ ఇద్దరూ ఒకరిపై ఒకరు ఆధిక్యాన్ని సాధించి, దాన్ని నిలుపుకోవాలని ప్రాణాలు ఒడ్డి ప్రయత్నించినట్టు నమ్మించటంలో కృతకృత్యులయ్యారు. అందుకే ఈ పాట 'హిట్' అయింది. ఇదే తెలుగులో బాలసుబ్రహ్మణ్యం, చక్రవర్తిలు విఫలమయ్యారు. వారు హాస్యం సృష్టిస్తున్నామన్న స్పృహను కనబరచారు. పైగా వారిలో కిషోర్ కుమార్, మహమూద్ స్థాయి హాస్యనటులు ఎవరూ లేరు.

హిందీ సినిమాల్లో 'ఖవ్వాలీ'లు ఇలాంటి పోటీ పాటలు. పాటలలో పోటీ ఎంత తీవ్రంగా ఉంటుందంటే రెండు భిన్నమైన అభిప్రాయాలు ఎవరికి వారు అదే ప్రాణమన్నట్టు ప్రకటిస్తూ, ఎదుటివారి అభిప్రాయాన్ని ఖండిస్తూంటారు.

ఎక్కడా విసుగురాదు. పైగా రెండు అభిప్రాయాలూ సమంజసం అనిపిస్తాయి. ఇలాంటి పాటలు రాయటం కత్తిమీద సాములాంటిది. రచయిత తన స్వీయ అభిప్రాయంతో సంబంధం లేకుండా రెండు భిన్నమైన అభిప్రాయాలనూ తన స్వంతం చేసుకుని ఆ దృక్కోణంలో పాటను రాయాలి. అందుకని అందరు గేయ రచయితలూ అద్భుతమైన స్థాయిలో ఖవ్వాలీలు రాయలేదు. సాహిర్ లూధియాన్వీ బర్సాత్‌కి రాత్ ఖవ్వాలి 'యే ఇష్క్ ఇష్క్ హై', మజ్రూహ్ సుల్తాన్ పురి 'హం కిసీ సె కం నహీ'లో రాసిన టైటిల్ ఖవ్వాలీ, షకీల్ బదాయుని 'మొఘల్ – ఎ ఆజం'లో రాసిన 'తేరీ మహఫిల్ మె కిస్మత్ ఆజ్మాకర్' వంటివి హిందీ సినీ సంగీత చరిత్రలో అత్యద్భుతమైన ఖవ్వాలీలలో కొన్ని. అలాంటి పోటీ పాటగా ఎదిగించారు 'ఏక్ చతుర్ నార్' పాటను.

కిషోర్ కుమార్, మన్నాడే లయను భగ్నం చేసిన తరువాత ప్రత్యర్ధిని అర్ధం పర్ధం లేదనిపించేటటువంటి లయబద్ధమైన పదాలతో సందేహంలో పడేస్తాడు.

**అరే ఆ ఆ ఈఈ ఊ ఊ ఏఏ అం అః**

**ఉం నమ నమ నమ నమ నమ నమ**

**ఉం బోల్ బోల్ బోల్ బోల్ రే.**

**బోల్ బోల్ బోల్ రే.. బోల్ బోల్ బోల్ రే.**

ఇలా రాగం మార్చి అర్ధం లేనివనిపించే రీతిలో అర్ధవంతమైన పదాలు పాడి అయోమయం కలిగించి, హఠాత్తుగా రాగంలోకి దూకుతాడు. ప్రత్యర్ధి మాటకు మాట సమాధానం ఇస్తాడు.

**ఏక్ చతుర్ నార్ బడి హోషియార్**

**అప్నే హి జాల్ మే ఫసత్ జాత్**

**హం హసత్ జాత్ , అరె హోహోహో**

అమ్మాయి అలంకరించుకుని తన హృదయంలో ప్రవేశించి చంపేస్తోందని ప్రత్యర్ధి అంటే, ఆమె చాలా తెలివైంది, మోసగత్తె. తన వలలో నిన్ను ఇరికిస్తోంది. అది చూసి మాకు నవ్వొస్తోంది అంటూ పాటలో నవ్వుతాడు కిషోర్ కుమార్ హేళనగా. సీరియస్‌గా ఉన్న సునీల్‌దత్‌ను నవ్వించేందుకు అతనికి గిలిగింతలు పెడతాడు. ఇది మరింత హాస్యాన్ని కలిగిస్తుంది.

ఇప్పుడు ఇద్దరి నడుమ పోటీకి ప్రాతిపదిక ఏర్పడింది. అమ్మాయి అమాయకురాలు, అని ఒకరు, ఆమె మోసగత్తె అని మరొకరు నిరూపించాలన్నది లక్ష్యం. మధ్యలో అమ్మాయి మహమూద్ వైపు మద్దతు నివ్వటం, ఆమె హృదయాన్ని గెలవాలంటే ఆమె మెచ్చే వ్యక్తిని తక్కువ చేసి చూపాలని ప్రయత్నించటంతో హాస్యం ఇంకా పండుతుంది.

ఇక్కడ మరో చమత్కారం చేశారు.

'తు' అని సునీల్‌దత్ పాత్ర అంటుంది. అది లయలో ఉండదు. వెనక్కాలనుంచి ఏం పాడతాడో తెలియక చేసిన పొరపాటు అది. ఎదుటి వాడి తప్పును ఆసరాచేసుకుని వాడిని దెబ్బతీయటం గెలుపుకు రహదారి. దాంతో ప్రత్యర్థి దాన్ని అవకాశంగా తీసుకుని ఆధిక్యంలో ఉన్న ప్రత్యర్థిని పడగొట్టి తన ఆధిక్యాన్ని నిరూపిస్తాడు.

**'తూ'కి సమాధానంగా 'ఛీ' అంటాడు.**

**తూక్యూన్ గోరీ ధ్యాన్ ధరే**

**కరె లాఖ్ లాఖ్ దునియా చతురాయి**

**చుట్టీ కర్ దూంగా మై ఉస్కీ**

**అబ్ కే జో అవాజ్ లగాయె**

'చుట్టీకర్‌దూంగా' అంటూ రాగం తీసి నృత్యంలోకి దిగుతాడు. అంటే ప్రత్యర్థికి అవకాశం అన్నది ఇవ్వటంలేదు. తన ప్రతిభ పాటవాలను ప్రదర్శించి ప్రత్యర్థిని అదరగొట్టాలను కుంటున్నాడు. 'జంతు ప్రపంచం'లో ఒక ఆడజంతువు కోసం రెండు మగ జంతువులు తమ శక్తిని ప్రదర్శించే నృత్యం చేస్తాయి. తమ గోళ్లు, పళ్లు చూపించి ప్రత్యర్థిని బెదరగొట్టాలని ప్రయత్నిస్తాయి. అలాంటి నృత్యం ఇది. అలాంటి పాట ఇది. ప్రేక్షకుల ఉపచేతనలోని ఈ లక్షణాన్ని జాగృతం చేయటంలో కళాకారులు సఫలం అవటంతో 'ఇందుకు' అని తెలియకుండానే ప్రేక్షకులు, శ్రోతలు ఈ పాటతో తాదాత్మ్యం చెందుతారు. వారి మనస్సు మారుమూలలో నిద్రాణమై ఉన్న ఈ లక్షణం సంతృప్తి చెందుతుంది.

పాటలో అర్థం సామాన్యమైనదే అయినా సందర్భాను సారం గమ్మత్తయినది.

'ఓ అమ్మాయీ, వీళ్ళందరినీ ఎందుకు పట్టించుకుంటావు?

ప్రపంచం అమ్మాయి కోసం బోలెడన్ని చమత్కారాలు చేస్తుంది. నువ్వు వారిని పట్టించుకోకు. అమ్మాయిని ఆకర్షించాలని ప్రపంచం బోలెడన్ని వేషాలు వేస్తుంది. ఈసారి ఆమెని ఎవరు పిలిస్తే, అంటే ఆమె దృష్టిని ఆకర్షించాలని ఎవరు ప్రయత్నిస్తే వారి పని పడతాను.

'చుట్టీకర్‌దూ' అంటే అందరి పని పడతాను అని అర్థం వస్తుంది. 'చుట్టీ' అంటే సెలవు అని అర్థం. అందరికీ సెలవు ఇచ్చేస్తాను అంటే సెలవులతోపాటు 'పనిలేని తనం' అన్న అర్థం కూడా ఉంది. అమ్మాయిని గెలవాలని ప్రయిత్నిస్తున్న వారందరికీ పనిలేకుండా చేస్తాను అనటం కూడా 'పని పడతాను' అన్న అర్థాన్ని ఇస్తుంది. 'పని పడతానూ' అని బెదిరించి, రాగాలు తీస్తూ నృత్యం చేయటం అద్భుతమైన హాస్యం. ఇప్పుడు మహమూద్ పాత్ర ఆధిక్యాన్ని సంపాదిస్తుంది. దాంతో కిషోర్ కుమార్ పాత్ర మళ్లీ ప్రత్యర్థి లయను దెబ్బతీసి అయోమయాన్ని కలిగించి ఆధిక్యాన్ని సంపాదించాల్సి ఉంటుంది.

**ఫాడ్ కె బోతన్ చీర్ ఖి చక్కర్**

**హర బుడి ఖుది – బుడి ఖుద్ కర్**

**ఛిటాకె తొూరెరె మోన్ మక్కన్**

**సబ్ చలేగయే, సబ్ చలేగయె, చిడామూఢ్ చిటింగ్ చిట్ బుద్**

**చిట్టు బుద్ గయ, చిటు బుదు గయ, చిట్ బుద్ హాయ్ హాయ్ హాయ్..**

అద్భుతమైన పదాలు. కిషోర్ కుమార్ పాడుతున్నది వింటూంటే ఏదో అర్థం లేని పదాలు అంటున్నట్టు అనిపిస్తుంది. హాస్యం కలిగిస్తుంది. కానీ ప్రతిపదానికీ అర్థం ఉంది. 'చుట్టీ కర్ దూంగా' అన్న దానికి సమాధానం ఈ పదాలలో దాగుంది.

'చెట్టు బెరడు నరికినట్టు నరుకుతా.. తల తిరిగిపోతుంది. ప్రతి ముసలివాడు తనని గొప్ప అనుకుని పిచ్చి వేషాలు వేస్తే కత్తితో వెన్నను కోసినట్టు కోస్తా. ఇలాంటి వారెందరో తోక ముడుచుకుని వెళ్లిపోయారు. తమ చిట్టాలు పట్టుకుని పారిపోయారు..పారిపోయారు.. పారిపోయారు. నువ్వూ పారిపో. అర్థమైతే హాస్యం అర్థం కాకుంటే కూడా హాస్యం. కిషోర్ కుమార్ పాడిన విధానం పదాలు పలికిన విధానం అత్యంత హాస్యం కలిగిస్తుంది. ప్రత్యర్థి నృత్యం ఆగిపోతుంది. అయోమయం మొదలవుతుంది. అలా ప్రత్యర్థిని అయోమయంలో పారేసి తన ఆధిక్యాన్ని నెరపుతాడు కిశోర్ కుమార్

**జారే జారే కారే కాగా**

**కా కా కా క్యూ షోర్ మచాయే**

**ఉస్ నారీ కా దాస్ న బన్ జో**

**రాహ చలతే కో రాహ భులాయే**

'పోరా నల్లకాకీ, కావు కావుమని అరుస్తున్నావెందుకు? దారిలో వెళ్తున్నవాడు దారి మరచిపోయేట్టు చేసి దారి తప్పించే అమ్మాయి ప్రలోభంలో పడి ఆమె దాసుడివి కాకు' అంటాడు. ఇక్కడ 'నల్లకాకి' అన్నది మహమూద్ పాత్ర రూపానికి సంబంధించినది. మహమూద్ తమిళుడు. కిషోర్ కుమార్ ఉత్తర భారతదేశం వాడు. ఇటువైపు వాళ్లు నల్లవారు. అటువైపు వాళ్లు తెల్లవారు. 'కారే కాగా' , నల్లకాకి, అన్న మాట వినగానే మహమూద్ తలవంచుకుని సిగ్గుపడతాడు. ఆ కాలంలో కాబట్టి అది సినిమాకే పరిమితమయింది. ఈ కాలంలో అయితే బాడీ షేమింగ్ నుంచి ఉత్తరాది అహంకారం వరకూ అందరి మనోభావాలు దెబ్బతిని గొడవలు జరిగి పోయేవి. అది సహనంతోపాటు సెన్సాఫ్ హ్యూమర్ ఉన్న కాలం కాబట్టి సరిపోయింది.

ఆధిక్యం సంపాదించటంతో ఆగదు కిషోర్ కుమార్ పాత్ర, ప్రత్యర్థిని సంపూర్ణంగా లొంగదీయాలని ప్రయత్నిస్తుంది. రాగం మార్చి దూషిస్తూ పాడుతుంది.

**కాలా రే జారే జారే**

**ఖారే నాల్ కె పానీ మె, మూహ్ ధోకే ఆరే**

**కాలా రే జారె జారే, ఓ గా రే గా రే!**

'కాలా రే' అంటే ఓ నల్లవాడా! అంత గౌరవప్రదమైన పిలుపు కాదు. కానీ ఆల్ ఈజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ వార్ అంటారు. ఇక్కడ ఆ అమ్మాయికి నచ్చినవాడిని ఎంత నీచంగా చూపిస్తే అంతగా మన హీరో కసి తీరుతుంది. అందుకని ఈ చరణంలో ప్రత్యర్థిని అవమానించటము, తక్కువ చేయటమే కాదు రాగం మార్చి పాడి 'నువ్వూ పాడరా' అని ఛాలెంజ్ చేస్తున్నాడు. 'నల్లవాడా, పోయి శుభ్రమైన నీళ్లతో ముఖం కడుక్కుని రా' అంటున్నాడు. అంటే నల్లటి ముఖం అశుభ్రంగా ఉంది. కాస్త ముఖం కడుక్కుని శుభ్రంగా రా' అంటూ 'కాలా రే జా రే జా రే ' అని గుండెల్లో బాకు గుచ్చుతున్నాడు. అమ్మాయి అందమైనది. ఆమె కోసం ఆశపడేవాడు నల్లవాడు. కురూపి. కాబట్టి అతని రూపాన్ని గుర్తుకు

తెచ్చి అవమానిస్తున్నాడు. ముఖం కడుక్కో పో అంటున్నాడు. అయితే, అంతటితో సిగ్గుపడి మైదానం వదిలేవాడు కాదు ప్రత్యర్థి. ఎదుటివాడు రాగాలు మార్చి, తనని అవమానిస్తూ, పోటీని పక్కదారి పట్టించి గెలవాలని చూస్తున్నాడని అర్థం చేసుకున్నాడు. తనకు ఉన్నంత శాస్త్రీయ సంగీత పాండిత్యం ఎదుటి వాడికి లేదు కాబట్టి గిమ్మిక్కులు చమత్కారాలతో గెలవాలని చూస్తున్నాడని అర్థం చేసుకున్నాడు. అది నిజం కూడా . శాస్త్రీయ సంగీతంలో మన్నాడేకు ఉన్నంత శాస్త్రీయ సంగీత ప్రావీణ్యం ఎదుటివాడికి లేదు. శాస్త్రీయ సంగీతంలో మన్నాడే ముందు నిలవగలిగే గాయకుడు మరొకడు హిందీ సినీ ప్రపంచంలో లేడు. ఈ విషయం అందరికీ తెలుసు. అందుకే ఓ సందర్భంలో 'రఫీ కనుక లేకపోతే నేను నెంబర్ వన్ అయి ఉండేవాడిని' అని మన్నాడే ప్రకటించాడు కూడా. అందుకే కిషోర్ కుమార్ ఎంతగా నెంబర్ వన్ గాయకుడయినా రఫీ, మన్నాడేల తరువాతనే సంగీతం తెలిసినవారు కిషోర్ కుమార్ పేరు వేస్తారు.

దూసుకుంటూ పోతూ, దారి మళ్లించి విర్రవీగుతున్న ప్రత్యర్థి మోసాన్ని అమ్మాయికి తెలిసేట్టు చేస్తూ, చేజారిపోతున్న పోటీని తిరిగి తన పట్టులోకి తీసుకు వచ్చే ప్రయత్నాలు ఆరంభిస్తాడు మహమూద్. కానీ ప్రత్యర్థికి అడుగు ఇవ్వటానికి కూడా ఇష్టపడని కిషోర్ కుమార్ అతడిని హేళన చేస్తూ అడ్డుపడుతుంటాడు. పాడమని ఛాలెంజ్ చేస్తూంటాడు.

యే గడ్ బడ్ జీ

ఓ గా రే గా రే

యే సుర్ బద్‌లా

ఓ గా రే గా రే

యే హం కో భట్ కాయా బోలా

ఓ గా రే గా రే

యే సుర్ బద్‌లా

ఓ గా రే గా రే

యే హం కో భట్ కాయా భోలా

**ఓ గా రే గా రే**

**యే సుర్ కే ధర్ హైజీ? యే సుర్ ! య్! ఎన్నయా ఇధు.**

కిషోర్ కుమార్ వెక్కిరింతని పట్టించుకోకుండా, తప్పిన రాగాన్ని వెతుక్కుని, హార్మోనియంపై ఆ 'నోట్'ని పట్టుకుని పాట ఆరంభిస్తాడు. మన్నాడే తమిళియన్ యాసతో, మహమూద్ స్వరాన్ని అనుకరిస్తూ పాడతాడు. అద్భుతమైన కళాకారులు వారు.

'ఎక్ చతురనార్ '

నోట్ దొరికింది. నాయిక చేతిని పట్టుకుంటాడు. ప్రత్యర్థి తనని అవమానించాడు. అమ్మాయికి తగని వాడన్నాడు. కానీ అమ్మాయి తన దగ్గర ఉంది. కాబట్టి ప్రత్యర్థిని ఉడికించి, అసూయ రగిలించి ఏడ్పించాలనుకున్నాడు. అమ్మాయి చెయ్యిని గట్టిగా పట్టుకుని 'ఉం! పకడ్ కె రఖేగా జీ!' అంటాడు. ఆ పట్టుకుని ఉండేది నాయిక చేయినా? రాగాన్నా? అన్నది ఎవరికి తగ్గట్టు వారు అర్థం చేసుకుంటారు. పాటలో ఒక పాదానికి పోటీ స్థాయి పెరిగిపోతోంది. No holds barred fight లా తయారవుతోంది. ఎలాంటీ నియమ నిబంధనలు లేని fight to finish లా ఎదుగుతోంది. పోటా పోటీ గా సాగుతున్న ఈ పాట సాగుతున్న కొద్దీ పెరిగే పోటీ స్థాయితో పాటు ప్రేక్షకుడి ఉత్కంఠ పెరుగుతుంది. ప్రత్యర్థిని ఉడికిస్తూ, నాయిక వైపు సైగ చేస్తూ, మరో అర్థం ధ్వనించేలా నటిస్తాడు మహమూద్ పాడుతూ.

**మెరె మన్ కె ధ్వార్ యే ఘుసత్ జాత్**

**హం మరత్ జాత్, అరె**

ఇక్కడ మన్నాడే 'ఘుసత' అన్న పదాన్ని పలకటంతో ఓ వైపు వ్యంగ్యం, మరోవైపు విజయ భావన, ఇంకో వైపు 'మీరేం చేస్తారు?' అన్న భావనలు ధ్వనింపచేస్తాడు. ఇప్పుడు ఇంక అంతిమ విజయం కోసం పావులు కదుపుతాడు. 'నువ్వెంత? నీకేం తెలుసు?' అన్నట్టు పాడతాడు.

**నాచ్ న జానే ఆంగన్ తేడా**

**తూ క్యా జానే క్యా హై నారీ**

**జిస్ సంగ్ లాగే మోరే నైనా**

**ఉస్పే సారీ దునియా వారీ**

**నాచ్  న జానే అంగన్ తేడా...తేడా......**

'ఆడలేనివాడు మద్దెల ఓటన్నట్టు' నీకు యువతుల గురించి ఏం తెలుసు? ఎవరితోనైతే నా కళ్లు కలిశాయో, ఆమెపై ప్రపంచమంతా పడి ఛస్తుంది' అని 'ఇక తేడా.. తేడా.. అంటూ వెక్కిరింత మొదలు పెడతాడు. నృత్యం చేయరాని వాడు వేదిక వంకరగా ఉన్నదని హిందీ సామెత అర్థం. 'తేడా' అంటే వంకర. 'తేడే' అంటే 'వంకర బుద్ధి కలవాడు'. 'వేదిక వంకర'ను 'తేడా' అంటూ నీ బుద్ధి వంకర, అన్నట్టుగా మార్చటం పదాలతో ఆడటం! అద్భుతం! రాజిందర్ క్రిషన్ పలు భాషలలో నిష్ణాతుడు. అతడికి తమిళం వచ్చు. అందుకే పలు తమిళ సినిమాలు హిందీలోకి తర్జుమా అయినా, తిరిగి తీసినా స్క్రిప్టును పాటలను రాసేందుకు రాజిందర్ క్రిషన్‌నే ఎంచుకునేవారు. గొప్ప గేయ రచయిత అతడు. అతడి ప్రతిభకు తగిన ఖ్యాతి దక్కలేదు.

ఇక్కడ కిషోర్ కుమార్ 'తేడా'ను పట్టుకుని చమత్కారం చేశాడు.

'ఓ తేడే' అంటూ మళ్లీ ప్రత్యర్థి లయను, సమతౌల్యాన్ని దెబ్బతీశాడు. ఇక్కడ 'తేడే' అంటే 'వంకరగాడా' అన్న అర్థం. ఆ సమయానికి అటూ ఇటూ ఎగుర్తూ వంకరటింకరగా ఉంటాడు మహమూద్. కిషోర్ కుమార్ 'తేడే' అనగానే 'ఓయ్' అంటాడు. అప్పుడు సైరాబాను తూష్ణీం భావంతో చూస్తుంది. మహమూద్ పాత్ర సిగ్గుపడుతుంది. ప్రత్యర్థిని catching off balance అంటే ఇదే. ఇక్కడి నుంచి కిషోర్ కుమార్ ఆధిక్యం కొనసాగుతుంది. ఎంత ప్రయత్నించినా ప్రత్యర్థికి చిటికెన వేలు మోపే స్థలం కూడా ఇవ్వడు.

**ఓ తేడే ..సీధే హోజారే...**

**వహరి చందనియా, వహరి చకోరి**

**రాం బనాయి యే కైసీ జోడి**

**కరే నచయ్య థా థా థయ్య**

**తాల్ పె నాచే లంగ్డీ ఘోడీ**

**అరే దేఖీ, దేఖీ , తెరీ చతురాయీ**

**తుఝె సుర్ కి సమఝ్ నహి ఆయి**

**తూనే కోరీ ఘాస్ హీ ఖాయీ..**

ఇక్కడ దెబ్బతిన్న శత్రువుని చావు దెబ్బ కొట్టటమే కాదు, అతడిని సమర్ధిస్తున్న ప్రేయసినీ హేళన చేసి, వెంటనే రాగం మార్చి సంపూర్ణ విజయం కోసం దూసుకుపోతాడు. ఇక్కడ 'అరె దేఖీ తెరీ చతురాయీ' దగ్గర రాగం మారుతుంది. అప్పుడు మహమూద్ 'యే ఫిర్ ఘడ్ బడ్' అంటాడు. అప్పుడు మళ్లీ కాస్త రాగం మార్చి అదే వాక్యం అంటాడు కిషోర్ కుమార్. 'ఫిర్ భట్ కాయా' అంటాడు మహమూద్. అప్పుడు 'నీకు రాగాలు అర్థం కావటంలేదు' అని చావు దెబ్బ కొట్టి నువ్వు గడ్డి తిన్నావు' అని అవమానిస్తాడు. కిషోర్ కుమార్ గడ్డి తినటం నటించి మరీ చూపుతాడు. ఎలాంటి వాడికయినా నవ్వు రాక మానదు. ఒక వ్యక్తి అవమానానికి గురయితే కదా, ఇంకొకరికి హాస్యం కలిగేది.

ఓ వంకరవాడా, తిన్నగా నిలబడు. ఎలాంటి చంద్రుడు, ఎలాంటి చకోరం? రాముడు ఎలాంటి జంటను తయారు చేశాడు. నచయ్య అంటే నృత్యం చేసేవాడు. కరే నచయ్య, థా థా థయ్య అంటే నృత్యం చేసేవాడు నృత్యం చేస్తున్నాడు థా థా థయ్య అంటూ..ఇది హేళన, వెక్కిరింత. ఒకరేమో తకధయ్య అని నృత్యం చేసేవాడు. ఆ లయకు నృత్యం చేసే కుంటి గుర్రం ఆమె. ఈ వాక్యం అంటున్నప్పుడు నాయిక ఒంటి కాలిపై దూకుతూంటుంది. అని దేవుడా ఎంతటి చమత్కారం చేశావు అన్నట్టు.. నీ గొప్ప తెలివి చూశాంలే అని ప్రత్యర్థితో అంటున్నట్టు అంటాడు. అని 'నీకు రాగం అర్థం కాలేదు. నువ్వు గడ్డి తిన్నావు' అంటే నువ్వు 'గుర్రంలాంటోడివి అన్నట్టు అంటున్నాడన్నమాట. గుర్రాలకు ఇష్టమైన తిండి గడ్డి. ఎక్కువ గడ్డి తింటే అని లావెక్కుతాయి. ఆరోగ్యం దెబ్బతింటుంది. అంటే 'గడ్డి తిని బలిసిన గుర్రం' అన్నాడన్నమాట ప్రత్యర్థిని. అంతటితో ఆగలేదు.

'అరే ఘోడే' అని పిలుస్తాడు. అప్పుడు మహమూద్ 'వీడు నన్ను గుర్రం అంటున్నాడు' అంటాడు. ఓడిపోయే వాడి మాట అది. పోటీ వదలి సింపతీ కోసం ప్రయత్నం ప్రారంభించాడు. అయితే ప్రత్యర్థి తన విజయాన్ని సంపూర్ణం చేయాలని అవమానాన్ని మరింత తీవ్రం చేశాడు. ఇక్కడ గేయ రచయిత పదాలతో ఆడుకోవటం మరోసారి గమనించవచ్చు. ముందు 'ఘోడే' అన్నాడు. ఇప్పుడు 'నిఘోడే' అంటున్నాడు. 'నిఘోడే' అంటే 'పనికి రాని వాడు' అని అర్థం. అప్పుడు మహమూద్ 'వీడు నన్ను తిడుతున్నాడు 'యే గాలీ దియా' అంటాడు. అంటే 'పోటీ' పక్కకు తిప్పి 'తిట్లు' ఆటగా మారిందన్నమాట. కానీ మహమూద్ తిరిగి తిట్టి ప్రత్యర్థి స్థాయికి దిగజారడు. తనకు తెలిసింది సంగీతం. కాబట్టి పక్కదారి పట్టిన పోటీని మళ్లీ తన దారిలోకి తీసుకునేందుకు సరైన దారిలో పెట్టాలని ప్రయత్నిస్తాడు. ది లాస్ట్ స్టాండ్, the last stand, అన్నమాట. కానీ శత్రువు ఇసుమంత కూడా స్థలం ఇవ్వడు.

యక్ చతుర నార్

ఘోడే దేఖీ తెరీ చతురాయీ

మళ్లీ పాట అందుకున్న ప్రత్యర్ధి 'గుర్రం.. నీ తెలివి చూశా 'నంటున్నాడు.

యక్ చతుర నార్

ఘోడే దేఖీ చతురాయీ

ఇప్పుడు తారుమారయిపోతాయి వాక్యాలు. కిషోర్ కుమార్ 'ఎక్ చతురనార్' అంటే మన్నాడే 'అయ్యో ఘో డే తెరీ' అంటాడు. ఇలా ఎవరు 'ఘోడా' అంటున్నారు. ఎవరు 'చతుర నార్' అంటున్నారో తెలియని పరిస్థితి. దాంతో మహమూద్ మళ్లీ పరిస్థితిని అదుపులో తెచ్చుకోవాలని ప్రయత్నిస్తాడు.

క్యారే? యె ఘోడా చతుర, ఘోడా చతుర్..భోలా

యేక్ పె రహనా... యా ఘోడా బోలో, యా చతుర్ బోలో..గా!

ఛాలెంజ్ విసిరాడు. ఎవడిష్టం వచ్చినట్టు వాడు పాడితే అది పోటీకాదు. పోటీకి నియమం ఉండాలి. ఇద్దరూ ఒకటే పాడాలి. ఇది ఫైనల్ అన్నమాట. అందుకే మళ్లీ కిషోర్ కుమార్ రూటుమార్చి, రాగం అయోమయం కలిగించి గెలుస్తాడు. పోటీని ముగిస్తాడు.

ఎక్ చతురనార్ బడి హోషియార్

అప్నే హి జాల్ మే ఫసత్ జాత్

ఎక్ చతురనార్ (బాణీ వేగవంతమవుతుంది. పిచ్ పెరుగుతుంది)

బడి హోషియార్.

మెరె మన్‌కి ద్వార్, యే ఘుసత్ జాత్.

హం మరత జాత్, మరత జాత్ (హై పిచ్‌లో మన్నాడే గొంతు విరుగుతుంది)

యే అటక్ గయా! (జాలిగా అంటాడు)

**ఇదే అవకాశాన్ని అందిపుచ్చుకుంటాడు కిషోర్ కుమార్**

**సా... రే___. గా... మా... పా... హే.... ఆ...ఆ...హే!**

పాట అయిపోతుంది. హీరో విజయం సంపూర్ణమవుతుంది. ప్రత్యర్థి ఓటమిని అంగీకరిస్తాడు. నాయిక కిటికీ తలుపు వేసి, రేడియో సంగీతం పెంచుతుంది. 'పడోసన్' సినిమాలో కీలక ఘట్టం, సినిమాను తరతరాలు గుర్తుంచుకునే ఘట్టం పూర్తవుతుంది.

పాట చిత్రీకరణ సందర్భోచితంగా ఉంటుంది. ఎడిటింగ్ అద్భుతంగా ఉంటుంది. కెమెరా కదలికలు అర్థవంతంగా ఉండి, పాట ప్రభావాన్ని పెంచుతాయి. 'వారె చందనియా' అన్న వాక్యం వచ్చేటప్పుడు అంతకు ముందు సీన్ కట్ అయి తెరపై హఠాత్తుగా సునీల్‌దత్ కనబడటం 'గొప్ప ఎడిటింగ్ ఎఫెక్ట్ ' అలాగే 'కోరీ ఘాస్ హీ ఖాయీ' అన్నప్పుడు పాట పాడుతున్న సునీల్‌దత్ నుంచి వెనుక ఉన్న కిషోర్ కుమార్ వైపు కెమేరా కదలుతుంది. ఇలా చెప్తూ పోతే చిత్రీకరణ గురించి ఎంతో చెప్పాల్సి ఉంటుంది.

ఒక సినిమా పాట ప్రేక్షకులను అలరించాలంటే అన్నీ కుదిరితేనే అది సాధ్యమవుతుంది. దానికి ఏ ఒక్క కళాకారుడూ బాధ్యుడు కాదు. కళాకాకారుల సమ్యుక్త సృజనల సమిష్టి ఫలితం ఇది. ఏ పాటకయితే అన్నీ సరిగ్గా కుదురుతాయో అది ప్రజల మనస్సులను తరతరాలు రంజింపచేస్తుంది. అయితే ఆ సృజన వెనుక తపన ఉండాలి. నిజాయితీ ఉండాలి. ఇదే కిషోర్ కుమార్, మహముద్, రాజిందర్ కిషన్, ఆర్డీబర్మన్‌లు కలిసి మళ్లీ 'పడోసన్ ' లాంటి మేజిక్‌ను సృజించలేకపోయారు. ఈ స్థాయిలో మరో సృజనను చెయలేకపోయారు. 'ఎక్ చతుర నార్ ' లాంటి హంగామా మళ్లీ తెరపై చేయలేకపోయారు. అందుకే కళాకారులు నిజాయితీగా తమ పని చేస్తూ పోవాలి. కాలం నిర్ణయిస్తుంది ఏ కళ అత్యుత్తుమమైందో. సమకాలీకులు పలు ప్రలోభాలవల్ల తాత్కాలికంగా స్థాయిలేని కళనూ పైకెత్తినా, కాలం నిర్దయగా అసలు నుంచి నకిలీని వేరు చేస్తుంది. కానీ ఒకోసారి ఎంతో గొప్ప స్థాయిలో సృజించిన 'కళ' కూడా రావాల్సిన గుర్తింపు రాదు. దానికి 'విధి' వైపు వేలు చూపటం తప్ప మరేమీ చేయలేం. వచ్చే నెల మరిన్ని, హాస్య చమత్కార గీతాలను గురించి చర్చించుకుందాం.

Post your comments